సాక్షి
సూర్యాపేట
శనివారం । 2 । డిసెంబర్ । 2023



కొనసాగుతున్న 'రాచకాల్వ'
శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చే రాచకాల్వలో పూడికతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. - 8లో



కోడిబొమ్మ చీటీల పంపిణీ
పోలింగ్ రోజు మిర్యాలగూడలో ఓటర్లకు నాయకులు చికెన్ సంబంధించిన చీటీలు పంపిణీ చేశారు. - 10లో



రాజకీయ కుట్రను ఛేదించాలి
సాగర్ ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వ దాడి వెనుక రాజకీయ కుట్రను ఛేదించాలని జూలకంటి రంగారెడ్డి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

కాంగ్రెస్ కార్యకర్తల కృషి ఎనలేనిది : ఉత్తమ్



మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవాలని నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి ఎనలేనిదని హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఉత్తమ్‌ను నియోజకవర్గంలోని పలువురు నాయకులు కార్యకర్తలు కలిసి ముందస్తుగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణకు కాబోయే ముఖ్యమంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అని ఆకాంక్షించారు. అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ మున్ముందు ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన కోరారు. అనంతరం పోలింగ్ సరళి, ఎన్నికల వివరాలను ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నూతన మద్యం దుకాణాలు ప్రారంభం

సూర్యాపేట క్రైం: నూతన మద్యం దుకాణాలను శుక్రవారం ప్రారంభించారు. జిల్లాలో 99 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటన్నింటికి నల్లగొండ జిల్లా కేంద్రంలోని మద్యం డిపో నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. జిల్లాలోని 99 మద్యం దుకాణాలకు కేవలం 20 దుకాణాలకు మాత్రం కొత్త స్టాక్ వచ్చింది. మిగిలిన దుకాణాలకు ఇంకా స్టాక్‌రాకపోవడంతో శుక్రవారం అన్నీ తెరవలేదు. ఇంకొంత మంది దుకాణ యజమానులు దుకాణాల మరమ్మతులు చేసుకుంటున్నారు. ఒకటి రెండు రోజుల్లో మిగిలిన దుకాణాలకు కూడా పూర్తిస్థాయిలో మద్యం సరఫరా అవుతుందని జిల్లా ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ కోటాచలం, వైద్యసిబ్బంది, గ్రామస్తులు

తిరుమలగిరి (తుంగతుర్తి): ఎయిడ్స్‌పై అవగాహన ఉంటేనే దాన్ని నివారించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం అన్నారు. తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని తెలిపారు. సురక్షితం కాని లైంగిక సంపర్కం వల్ల, రక్త మార్పిడి వల్ల ఎయిడ్స్ వ్యాధి వస్తుందని తెలిపారు. హెచ్‌ఐవీ బారిన పడిన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మల్లెల వందన, సీహెచ్‌ఓ బిచ్చునాయక్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి మహాక్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య, శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, మధుపర్కర పూజ, మాంగళ్యధారణతో కల్యాణతంతు ముగించారు. చివరగా మహావేదనతో భక్తులను తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తుమాటి లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

లెక్కలు.. అంచనాలు

గెలుపు ధీమాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు
- పోలింగ్ సరళిపై తమ పార్టీ నేతలతో సమీక్షలు
- ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూపు
- ఏ నలుగురు కూడినా ఎన్నికల చర్చే..
- నల్లగొండలో గత ఎన్నికల కన్నా తగ్గిన పోలింగ్ శాతం



చివ్వెంల మండలం పాశ్యానాయక్ తండాలో ఓటుకోసం క్యూకట్టిన జనం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: సాధారణ ఎన్నికలకు సంబంధించి గురువారం పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఉమ్మడి జిల్లాలోని వివిధ పార్టీల అభ్యర్థులు, పార్టీ శ్రేణులు గెలుపు అంచనాల్లో మునిగిపోయారు. పోలింగ్ సరళి, రాజకీయ సమీకరణలపై సమీక్షలు జరుపుతున్నారు. 3వ తేదీన వెలువడే ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. పోలింగ్ గతంలో కంటే ఈసారి తగ్గింది. దీంతో ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే అంచనాల్లో అభ్యర్థులు ఉన్నారు. ఎన్ని ఓట్లు పోలయ్యాయి. వాటిల్లో ఏ ప్రాంతాల వారు, ఏ కులాల వారు ఎవరికి వేశారు. మనకు ఎంత మేరకు ఓట్లు పడ్డాయి అనే విషయాల్లో బూత్‌ల వారీగా నేతలతో కూర్చొని లెక్కలు వేసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లలో ఎన్ని వస్తాయి అనే దానిపై లెక్కలు తీస్తున్నారు.

తుది పోలింగ్ వివరాలు..

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
నల్లగొండ జిల్లా			
దేవరకొండ	2,51,622	2,12,593	84.49
నాగార్జునసాగర్	2,33,412	2,00,235	85.79
మిర్యాలగూడ	2,31,391	1,93,185	83.49
నల్లగొండ	2,44,460	1,99,479	81.60
మునుగోడు	2,52,648	2,32,158	91.89
నకిరేకల్	2,50,547	2,17,149	86.67
సూర్యాపేట జిల్లా			
హుజూర్‌నగర్	2,47,592	2,14,012	86.44
కోదాడ	2,41,554	2,06,676	85.56
సూర్యాపేట	2,41,799	2,03,624	84.21
తుంగతుర్తి	2,55,017	2,23,496	87.64
యాదాద్రి భువనగిరి జిల్లా			
ఆలేరు	2,33,266	2,11,744	90.77
భువనగిరి	2,16,941	1,95,060	89.91

మొత్తం పోలింగ్ శాతం



జిల్లా	శాతం
నల్లగొండ జిల్లా	85.71
యాదాద్రి జిల్లా	90.36
సూర్యాపేట జిల్లా	85.99

రెండు రకాలుగా సర్వేలపై..
ఎగ్జిట్ పోల్ సర్వేలపైనా అభ్యర్థులు అంచనాలు వేసుకుంటున్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి వేవ్ ఉందని ప్రచారం కావడం, దానికి అనుగుణంగా సర్వేల్లో కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ సీట్లు వస్తాయని చూపించడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తామే గెలుస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 11 నియోజకవర్గాల్లో తాము గెలుస్తామని చెబుతున్నారు. అయితే, మధ్యాహ్నం తరువాత పోలింగ్‌కు జనాలు బారులుదీరడంతో ఆ ఓట్లు ఎవరికి పడ్డాయన్న ఆందోళన వారిలో నెలకొంది. ఇక అధికార బీఆర్‌ఎస్ నేతలు మాత్రం మధ్యాహ్నం 12 గంటల నుంచి పోలైన ఓట్లు తమకు అనుకూలమని పేర్కొంటున్నారు. మధ్యాహ్న సమయంలోనే రైతు కూలీలు, రైతులు, 57 ఏళ్ల దాటిన వారు ఎక్కువ మంది ఓట్లు వేశారని, వారంతా సర్వేలను పట్టించుకోలేదని చెబుతున్నారు. సర్వేలు చేసే వారికి వారంతా సమాధానాలు చెప్పలేదని, సర్వేల ప్రతినిధులే ఏదో ఒక అంచనాతో వారే రాసుకున్నట్లుగా చెబుతున్నారు. పెన్షన్ పొందుతున్న వృద్ధుల ఓట్లు, రైతు బంధు పొందే రైతులు సర్వే చేసే వారికి చెప్పలేదని, తమకే వారు ఓట్లు వేశారని, ఆరేడు నియోజకవర్గాల్లో తాము గెలుస్తామని బీఆర్‌ఎస్ అభ్యర్థులు పేర్కొంటున్నారు.

నల్లగొండ జిల్లాలో తగ్గిన పోలింగ్
నల్లగొండ జిల్లాలో 2018 ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతం కంటే ప్రస్తుతం జరిగిన పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. గత ఎన్నికల్లో 86.82 శాతం నమోదు కాగా, ఈసారి 85.71 శాతం మాత్రమే నమోదైంది. సూర్యాపేట జిల్లాలో గతంలో 86.62 శాతం నమోదు కాగా ఈసారి 85.99 శాతం నమోదైంది. యాదాద్రి భువనగిరిలో 2018లో 90.33శాతం పోలింగ్ జరగగా.. ఈ ఎన్నికల్లో 90.36 శాతం నమోదైంది. ఈ జిల్లాలో స్వల్పంగా పెరిగింది.

తగ్గిన పోలింగ్ ఎవరికి అనుకూలం?
పోలింగ్ శాతం పెంపు కోసం అధికారులు అన్ని ప్రయత్నాలు చేసినా పోలింగ్ శాతం అంతగా పెరగలేదు. పైగా తగ్గిపోయింది. సాధారణంగా పోలింగ్ శాతం పెరిగితే అది ప్రభుత్వ వ్యతిరేక ఓటుగా భావిస్తారు. తగ్గితే.. ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని అంటారు. ఈసారీ మొదటి నుంచే కాంగ్రెస్ వేవ్ అంటూ ప్రచారం జరుగడం, ఎగ్జిట్ పోల్స్ ఎక్కువ శాతం కాంగ్రెస్‌కు అనుకూలంగానే ఉన్న పరిస్థితుల్లో పోలింగ్ శాతం ఎందుకు పెరుగలేదన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. తగ్గిన పోలింగ్‌శాతం ఎవరికి అనుకూలం, ఎవరికి వ్యతిరేకమన్న ఉత్కంఠ నెలకొంది.

వరుసగా మూడు ఎన్నికల్లో పోలింగ్ శాతం ఇలా

నియోజకవర్గం	2023	2018	2014
నల్లగొండ	84.49	85.59	74.89
నకిరేకల్	86.67	88.90	79.72
మునుగోడు	91.89	91.30	82.14
దేవరకొండ	84.49	86.24	76.46
నాగార్జునసాగర్	85.79	86.80	80.01
మిర్యాలగూడ	83.49	85.30	79.72
సూర్యాపేట	84.21	87.08	79.90
తుంగతుర్తి	87.64	86.33	78.05
హుజూర్‌నగర్	86.44	86.94	81.51
కోదాడ	85.56	89.44	85.02
భువనగిరి	89.91	90.77	85.28
ఆలేరు	90.77	91.47	85.73

గెలుపు ఓటములపై చర్చోపచర్చలు



అభ్యర్థుల గెలుపు ఓటములపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఏ నలుగురు కలిసినా రాజకీయ చర్చే కొనసాగుతోంది. గతంలోకి భిన్నంగా ఈసారి ప్రజా తీర్పు ఉంటుందని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రచారం సాగింది. ఫలితాలు ఎలా ఉండబోతున్నాయని దానిపై వివిధ ఏజెన్సీలు ఎగ్జిట్ పోల్స్ నిర్వహించాయి. అధిక శాతం కాంగ్రెస్ పార్టీనే గెలిచే అవకాశం ఉందని సర్వేలు చెబుతుండగా.. అధికార పార్టీ మాత్రం మూడోసారి హ్యాట్రిక్ సాధిస్తామని చెబుతూ వస్తున్నది. దీంతో అంతటా ఉత్కంఠగా చర్చలు కొనసాగుతున్నాయి. కాగా, ప్రచారాలు పోటాపోటీగా జరిగిన సందర్భంలో గెలుపు ఓటములపై బెట్టింగ్‌లు సాగేవి. ఈసారి సర్వేలన్నీ కాంగ్రెస్ వైపే ఉండటంతో బెట్టింగ్‌లు కట్టే వారి సంఖ్య తగ్గిపోయింది.

సమన్వయంతోనే పోలింగ్ ప్రశాంతం

- జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావు, ఎస్పీ రాహుల్ హెగ్డే



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది సమన్వయంతోనే జిల్లాలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఆదివారం జరిగే కౌంటింగ్ కూడా సహకరించాలని, కౌంటింగ్ రోజున ఏజెంట్లు తమ పాసుల కొరకు రిటర్నింగ్ అధికారికి శనివారమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గెలిచిన అభ్యర్థులు అదే రోజు ఎక్కడ కూడా ర్యాలీలు చేపట్టవద్దని, మరుసటి రోజు ర్యాలీలు నిర్వహించాలనుకునే అభ్యర్థులు ముందస్తు అనుమతులు తీసుకోవాలని కోరారు.

రేపు మద్యం దుకాణాలు బంద్ చేయాలి
ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఆదివారం జిల్లా అంతటా అన్ని మద్యం దుకాణాలు బంద్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- గంగాపురం ఆశ్రమ పీఠాధిపతి పరమాత్మనందగిరిస్వామి



మాట్లాడుతున్న పరమాత్మనందగిరిస్వామి

అర్వపల్లి: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని గంగాపురం ఆశ్రమ పీఠాధిపతి పరమాత్మనందగిరిస్వామి అన్నారు. రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలో గల అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్ర ఆవరణలో ఉన్న శ్రీరామకోటి ద్వితీయ స్థూపం తృతీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీకమాసం పునర్వసు నక్షత్రం రోజున ఈ స్థూప వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ వార్షికోత్సవానికి గంగాపురం మలయాళస్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమం పీఠాధిపతి పరమాత్మనందగిరిస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశంలో శాంతిని కలిగించే ఆధ్యాత్మికం ఉండడం మనకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములవారి పాదాలకు అభిషేకం, కార్యసిద్ధి వీరహనుమాన్ స్వామికి ప్రత్యేక పూజలు, భగద్గీత పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, భజనల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 8 కోట్ల శ్రీరామకోటి లిఖిత పుస్తకాలను రామకోటి స్థూపంలో నిక్షిప్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట సుధాకర్ గ్రూప్‌ఆఫ్ కంపెనీస్ ఎండీ మీలా మహదేవ్, మీలా వాసుదేవ్, భక్తరత్న గుండా శ్రీనివాసులు, చంద్రశేఖర్, యాదగిరి, ప్రభాకర్, రమేష్, వెంకన్న, హరినాథ్, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, నరేష్, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సహకరించాలి

- రెండవ అదనపు జిల్లా జడ్జి అమరావతి



జడ్జి అమరావతిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి

హుజూర్‌నగర్: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి అమరావతి అన్నారు. సూర్యాపేట జిల్లా కోర్టులో ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తిగా కొనసాగుతూ హుజూర్‌నగర్‌లోని రెండవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెకు స్వాగత, సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా న్యాయమూర్తిగా తన విధులను సక్రమంగా నిర్వహించడానికి న్యాయవాదుల సహకరించాలని కోరారు. కక్షిదారులకు సత్వర న్యాయాన్ని అందించడానికి న్యాయవాదులంతా తోడ్పాటునందించాలని కోరారు. అలాగే న్యాయస్థానాల్లో పేరుకుపోయిన పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని కక్షిదారులకు సూచించారు. అనంతరం ఆమెను న్యాయవాదులు శాలువా, బొకేలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్ కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాముల రామిరెడ్డి, అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాసరావు, న్యాయవాదులు ఎస్‌ఎస్‌ఆర్, ఎస్.సత్యనారాయణ, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, సీహెచ్.కష్ణయ్య, కె.బాలకష్ణ, డి.శ్రీనివాసరావు, నాగేష్ రాథోడ్, కె.నాగార్జున, రామలక్ష్మారెడ్డి, కె.సురేష్, శంకర్, పి.శ్రీనివాసరావు, శ్రీను, వీరయ్య, నరేష్, సత్యనారాయణ, మహిళా న్యాయవాదులు రేణుకాదేవి, ప్రదీప్తి, రమాదేవి, దీపిక, ప్రసన్న, ప్రభుత్వ న్యాయవాదులు ఉప్పల గోపాలకష్ణమూర్తి, బొబ్బా కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి అర్వపల్లి ఉర్సు



సిద్ధమవుతున్న దర్గా

- రెండు రోజుల పాటు ఉత్సవాలు
- ముస్తాబవుతున్న నసీరుద్దీన్ బాబా దర్గా
- వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో మొదలైన ఏర్పాట్లు



బాబా సమాధి

అర్వపల్లి: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచి రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన అర్వపల్లి శివారులోని హజ్రత్‌ఖాజా నసీరుద్దీన్ బాబా ఉర్సు ఈ నెల 8 నుంచి మొదలు కానుంది. రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. 8న తొలిరోజు సందల్, ఉర్సు జరుగనుంది. ఈ సందర్భంగా తొలిరోజు సాయంత్రం 4 గంటలకు అర్వపల్లి పోలీస్ స్టేషన్ నుంచి గంధం ఊరేగింపు మొదలై రాత్రి 9 గంటలకు దర్గాకు చేరుతుంది. అదేరాత్రి ఖవాలీ కార్యక్రమం నిర్వహిస్తారు. 9వ తేదీ రెండో రోజు దీపారాధన (చిరాగ్) కార్యక్రమం నిర్వహించి దర్గాలో దీపాలను వెలిగిస్తారు. దీంతో ఉర్సు ముగుస్తుంది.

ఉత్సవాలకు మొదలైన ఏర్పాట్లు
ఉర్సుకు సంబంధించి వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాట్లు మొదలయ్యాయి. భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకుండా విద్యుత్, నీటి వసతి కల్పిస్తున్నారు. అలాగే దర్గాకు రంగులు వేసే పనులు పూర్తి కావొస్తున్నాయి. దర్గాకు విద్యుత్ దీపాల అలంకరణ, దర్గా లోపల అలంకరణ పనులు చేపడుతున్నారు. అలాగే నకిరేకల్–తానంచర్ల 365 హైవే నుంచి దర్గా వరకు ఉన్న ఫార్మేషన్ రోడ్డు దెబ్బతినడంతో ఉర్సుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కాకుండా రోడ్డుపై గుంతలలో మట్టిపోసి చదును చేయిస్తున్నారు. అలాగే దర్గా చుట్టూ, పరిసరాలు కంప చెట్లు, పిచ్చిమొక్కల మయం కావడంతో వాటిని తొలగిస్తూ శుభ్రం చేస్తున్నారు.

"ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం



ఉర్సు ఉత్సవాలకు సంబంధించి ఈ నెల 7వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తాం. ఈ ఉర్సుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి రానున్నందున వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఉత్సవాలను తిలకించాలి.
– ఎస్‌కే.అలీ, దర్గా ముజావర్

సూర్యాపేటదే తొలి ఫలితం

రేపే ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటలకు ప్రారంభం
- మధ్యాహ్నం 2 గంటల వరకు పూర్తి ఫలితాల ప్రకటన
- తక్కువ రౌండ్లు ఉన్న సూర్యాపేట తర్వాత మిగతా వాటి రిజల్ట్
- కౌంటింగ్ కోసం ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేసిన అధికారులు



ఓట్ల లెక్కింపు కోసం సూర్యాపేట కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన టేబుళ్లు

సూర్యాపేట: అసెంబ్లీ సాధారణ ఎన్నికల పోరులో విజేతలెవరో.. పరాజితులెవరో తేలే సమయం ఆసన్నమైంది. ఆదివారం జరగనున్న ఓట్ల కౌంటింగ్‌కు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త వ్యవసాయ మార్కెట్లో గల గోదాముల్లో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి నాలుగు నియోజకవర్గాల ఓట్లు లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. సూర్యాపేట నియోజకవర్గానికి సంబంధించి తొలి ఫలితం వెలువడనుంది.

రౌండ్లు ఇలా..

నియోజకవర్గం	రౌండ్లు
హుజూర్‌నగర్	22
కోదాడ	22
సూర్యాపేట	20
తుంగతుర్తి	24

నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున..
ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపునకు 14 మంది సూపర్ వైజర్లుజర్లు, 14 మంది అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, 14 మంది మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. వీరు కాక సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు ఒక జనరల్ అబ్జర్వర్‌ను నియమించారు. ఒక్కో నియోజకవర్గానికి ఆర్వో ఉంటారు. ఒక రౌండ్ పూర్తయిన తర్వాత ఆర్వో, జనరల్ అబ్జర్వర్ 14 టేబుళ్లను ర్యాండమ్‌గా చెక్ చేస్తారు. వీరిద్దరు పరిశీలించిన తర్వాతే రెండో రౌండ్ ఫలితాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. ఒక్కో నియోజకవర్గం ఫలితాలు రౌండ్ల వారీగా బ్లాక్ బోర్డు, అలాగే స్క్రీన్ మీద డిసేల్ చేస్తారు. ఇక అభ్యర్థితో పాటు 14 టేబుళ్లకు 14 మంది ఏజెంట్లు ఉంటారు. ప్రతి రౌండ్ లెక్కింపును వీరు పరిశీలిస్తారు.

20 నిమిషాలకు ఒక రౌండ్ పూర్తి..
హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని 308 పోలింగ్ కేంద్రాలకు 22 రౌండ్లు, కోదాడ కోదాడలోని 296 పోలింగ్ కేంద్రాలకు 22, సూర్యాపేటలోని 271 పోలింగ్ కేంద్రాలకు 20, తుంగతుర్తిలోని 326 పోలింగ్ కేంద్రాలకు 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. ఒక్కో రౌండ్ 15 నుంచి 20 నిమిషాల్లో లెక్కింపు పూర్తి అవుతుంది. ముందుగా నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారు. ఆ తర్వాత ఈవీఎంల కౌంటింగ్ మొదలవుతుంది. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ఏదో ఒకటి వీవీప్యాట్ స్లిప్పులు కూడా లెక్కిస్తారు. ఒక్కో రౌండ్లో సుమారు 10 వేల నుంచి 12 వేల ఓట్లను లెక్కిస్తారు. ఆ నియోజకవర్గంలోని 14 పోలింగ్ స్టేషన్ల ఈవీఎంలలోని ఓట్లు ఒక్క రౌండ్‌కు వస్తాయి. తక్కువగా 20 రౌండ్లు సూర్యాపేట నియోజకవర్గానికి ఉన్నాయి. ఈ నియోజకవర్గ పూర్తి ఫలితం మధ్యాహ్నం 2గంటల వరకు వెలువడనుంది. దీని తరువాత కోదాడ, హుజూర్‌నగర్, తుంగతుర్తి ఫలితాలు రానున్నాయి.

"కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
వ్యవసాయ మార్కెట్లో కౌంటింగ్ సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కౌంటింగ్ ఎలా చేయాలో ఇప్పటికే అధికారులకు శిక్షణ ఇచ్చాం. ఒక్కో టేబుల్ ఓట్ల లెక్కింపునకు నియమించిన అధికారులు ఎలా ప్రక్రియ ప్రారంభించాలో వివరించాం. తుది ఫలితం వెలువడే వరకు రౌండ్ల వారీగా ఫలితాల ప్రకటన అధికారికంగా ప్రకటిస్తాం. అభ్యర్థులు, వారి తరఫున వచ్చే ఏజెట్లకు టేబుళ్ల వద్ద ఎలా ఉండాలో ఇప్పటికే సూచనలిచ్చాం.
– ఎస్.వెంకట్రావు, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


సైదులు (ఫైల్)

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. మునగాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన రైతు మాదాసు సైదులు(58) గురువారం ట్రాక్టర్ నడుపుకుంటూ ఆకుపాముల శివారులో గల కంకర మిల్లు నుంచి కోదాడ వైపు వెళ్లే రహదారిలో హైవే ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తాకొట్టడంతో సైదులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సైదులును 108వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సైదులు శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు మునగాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వరికోత మిషన్ దగ్ధం


సింగారెడ్డిపాలెంలో దగ్ధమవుతున్న వరికోత మిషన్

పెన్‌పహాడ్ : షార్ట్‌సర్క్యూట్‌తో వరికోత మిషన్ దగ్ధమైంది. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డికి చెందిన వరికోత చైన్ మిషన్ సింగారెడ్డిపాలెంలోని రైతు పేర్ల లింగయ్య పొలాన్ని కోస్తున్న సమయంలో విద్యుత్ తీగలకు తగిలి షార్ట్‌సర్క్యూట్‌కు గురై దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్‌తో వచ్చి మంటలను అదుపు చేశారు.

సెక్టోరియల్ అధికారిపై దాడి చేసిన పలువురిపై కేసు

నాగారం : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నర్సింహులగూడెం గ్రామంలో గురువారం రాత్రి ఈవీఎంలను తరలించే క్రమంలో సెక్టోరియల్ అధికారిపై దాడి చేసిన పలువురిపై శుక్రవారం నాగారం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ సైదులుగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సింహులగూడెం గ్రామం నుంచి సెక్టోరియల్ అధికారి పి.గణేష్ కారులో అదనపు ఈవీఎంలను తరలిస్తుండగా పేరబోయినగూడెం, నర్సింహులగూడెం గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డుకొని దాడిచేసి, కారు అద్దాలను ధ్వంసం చేశారని తెలిపారు. ఈ విషయంపై సెక్టోరియల్ అధికారి గణేష్ ఫిర్యాదు మేరకు పేరబోయినగూడెం, నర్సింహులగూడెం గ్రామాలకు చెందిన 20 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశామని, మరి కొంత మందిని గుర్తించాల్సి ఉందని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


ఆవు కళేబరం వద్ద రోదిస్తున్న రాజమ్మ

నిడమనూరు : మండలంలోని రేగులద్ద గ్రామంలో శుక్రవారం లింగాల రాజమ్మకు చెందిన ఆవు విద్యుదాఘాతంతో మృతిచెందింది. రోజువారీగా ఆవులను మేత కోసం గ్రామ సమీపంలోకి తీసుకువెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవు గడ్డి మేస్తూ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిందని యజమానురాలు తెలిపింది.

రిలాక్స్ మూడ్

నెల రోజులకు పైగా ప్రచారాన్ని హోరెత్తించిన ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికలు ముగియడంతో శుక్రవారం రిలాక్స్ మూడ్‌లోకి వచ్చారు. కొందరు కుటుంబ సభ్యులతో సరదాగా గడపగా మరికొందరు పోలింగ్ సరళిపై నాయకులతో చర్చలు జరిపారు.


హైదరాబాద్‌లోని తన నివాసంలో బంధువులతో మాట్లాడుతున్న సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


సూర్యాపేట సమీపంలోని హోటల్ సెవెన్‌లో కుటుంబ సభ్యులతో బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు


హైదరాబాద్‌లో రజాకార్ సినిమా డైరెక్టర్‌తో సమీక్ష చేస్తున్న భువనగిరి బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి


యాదగిరిగుట్ట: తన నివాసంలో కుటుంబ సభ్యులతో ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత


సూర్యాపేటలో కార్యకర్తలతో పోలింగ్ సరళిపై ఆరా తీస్తూ పండ్ల రసం తాగుతున్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి


నల్లగొండ: కుటుంబ సభ్యులతో కలిసి సీతాఫలం రుచి చూస్తున్న భూపాల్‌రెడ్డి


వలిగొండ మండలకేంద్రంలో కుటుంబ సభ్యులతో భువనగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి


నల్లగొండలోని తన నివాసంలో అమ్మతో కలిసి రజనీకాంత్ సినిమా చూస్తున్న తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిశోర్‌కుమార్


నల్లగొండలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి టీవీ చూస్తున్న బీజేపీ అభ్యర్థి మాదగాని శ్రీనివాస్‌గౌడ్


నల్లగొండలోని సీపీఎం కార్యాలయంలో పోలింగ్ సరళిపై నాయకులతో చర్చిస్తున్న ఆ పార్టీ అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

జోరుగా బెట్టింగ్!

- అభ్యర్థుల విజయావకాశాలపై స్థానికంగా జోరందుకున్న బెట్టింగ్
- రూ.1000 నుంచి రూ.లక్షల్లో పందేలు



సాక్షి, యాదాద్రి: భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా బెట్టింగ్ సాగుతోంది. ఓ పక్క పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి అనుచరులు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. మరో పక్క నలుగురు కలిసిన చోట పందేల జోరు ఊపందుకుంది. రూ.1000 నుంచి రూ.లక్షల్లో బెట్టింగ్ వేస్తున్నారు. అంతేకాకుండా తమ పార్టీ అభ్యర్థి గెలిస్తే దావత్ చేస్తాం.. టూర్‌కు తీసుకెళ్తామంటూ పందేలు కాస్తున్నారు.

ఫలితాలపై జనంలో ఆసక్తి..

భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో టీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యన హోరాహోరీ పోరు సాగింది. ఓటింగ్ జరిగి ఈవీఎంలలో అభ్యర్థుల భవిష్యత్ నిక్షిప్తమైన తరుణంలో ఓటింగ్ సరళి, గెలుపోటములపై అంచనాలు వేసుకుంటున్నారు. ఓట్లు వేసిన జనం మాత్రం ఫలితాల కోసం ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. అభ్యర్థులు గెలుపు ఓటములపై కోట్లలో పందేలు కాస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలు ఏపార్టీకి విజయావకాశాలు ఉంటాయన్నది సూచనప్రాయంగా చెప్పడంతో ఓటర్లలో మరింత ఆసక్తి నెలకొంది.

జనగామ ఎన్నికలపై కూడా..

భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలతోపాటు పొరుగునే ఉన్న హైదరాబాద్‌లో కూడా బెట్టింగ్ జోరు సాగుతోంది. మహిళలు, యువత, రాజకీయ గ్రామస్థాయి రాజకీయ పార్టీల నేతలు బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. ఈప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల, ఇతర వ్యాపార వర్గాల్లో కూడా అభ్యర్థుల జయాపజాయాలు ఆసక్తిని రేకెత్తిస్తోంది. రెండు నియోజకవర్గాల ఫలితాలపై హైదరాబాద్, బెంగళూరు, ఆంధ్రాలో భారీగా బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఒకరోజు ఆగితే ఫలితాలు తేలనున్న నేపథ్యంలో బెట్టింగ్ జోరు మరింత పెరిగే అవకాశం ఉంది. పొరుగున ఉన్న జనగామ అసెంబ్లీ ఎన్నికలపై కూడా జిల్లాలో బెట్టింగ్ సాగుతోంది. అక్కడ పోటీ చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల విజయంపై ఐపీఎల్ స్థాయి బెట్టింగ్‌లు సాగుతున్నాయి.

ఇన్‌చార్జిల చేతివాటం!

- అభ్యర్థులు ఇచ్చిన డబ్బుల్లో కమీషన్లు నొక్కిన కొందరు చోటా నేతలు
- డబ్బులు ఇవ్వలేదని ఇన్‌చార్జిలను నిలదీసిన ఓటర్లు



నల్లగొండ టూటౌన్ : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు డబ్బులను మంచినీళ్లలా ఖర్చు పెట్టిన విషయం బహిరంగ రహస్యమే. ప్రత్యర్థులను చిత్తు చేసి ఎలాగైనా గెలవాలనే టార్గెట్ పెట్టుకొని ముందుకు సాగిన ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ పార్టీలకు చెందిన వార్డు, గ్రామ ముఖ్య నాయకుల (ఇన్‌చార్జి) ద్వారా ఓటర్లకు మద్యం, డబ్బులు, మాంసం పంపిణీ చేశారు. కానీ కొందరు చోటా నాయకులు డబ్బులు పంపిణీ చేసే సమయంలోనే వెంట ఉన్న వారికి సైతం మస్కా కొట్టి ఓటర్లకు ఇచ్చే డబ్బులను నొక్కినట్లు ఆయా పార్టీలకు చెందిన సొంత మనుషులే అభ్యర్థుల దృష్టికి తీసుకుపోయినట్లు తెలిసింది. అవకాశంపోతే మళ్లీ దొరకదనే విధంగా కొందరు ఓటర్లకు పూర్తిస్థాయిలో పంపకాలు చేయకుండా జేబులు నింపుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వార్డుల్లోని కాలనీల్లో కొన్ని వీధుల్లోకి వెళ్లి కనీసం జనాలను ఓటు వేయమని కూడా అడగలేదని ఓటర్లు చెబుతున్నారు. కొన్ని చోట్ల సొంత పార్టీలకు చెందిన కార్యకర్తలకు సైతం డబ్బులు పంచకపోవడంతో.. ఇన్‌చార్జిల తీరు వివాదాస్పదంగా మారింది. నల్లగొండ పట్టణంలో కొందరు ఓటర్లు వార్డు ఇన్‌చార్జిలను డబ్బుల విషయంపై నిలదీసిన ఘటనలు సైతం ఉన్నాయి.

డబ్బులు కాజేసిన వారిపై నేతల నజర్..

నియోజకవర్గాల్లోని గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ఓటర్లకు పంచమని ఇచ్చిన డబ్బులు ఎంత మందికి చేరాయనే వివరాలను ఆయా పార్టీల అభ్యర్థులు సేకరిస్తున్నారు. ఒక్కో గ్రామంలో ఎంత మందికి ఇచ్చారు.. ఇవ్వకుండా నొక్కిన డబ్బులు ఎన్ని, తమ దగ్గర డబ్బులు తీసుకొని ప్రత్యర్థి పార్టీకి సహకరించిన వారెందరు అనే వివరాలను రాబడుతున్నారు. అభ్యర్థులు ఇచ్చిన డబ్బులు, వారికి వచ్చే ఓట్ల శాతం తదితర వివరాలను క్రోడీకరించడంతో పాటు స్థానిక నాయకత్వం ద్వారా సమచారం సేకరిస్తున్నారు. డబ్బులు నొక్కి తమకు హ్యాండ్ ఇచ్చిన వారికి రానున్న రోజుల్లో చెక్ పెట్టే ప్రయత్నం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డబ్బులు పంచకుండా నొక్కిన వారిపై ఫిర్యాదులు వెల్లువెత్తగా కొన్ని చోట్ల ఇప్పటికే సదరు నాయకులకు అభ్యర్థులు ఫోన్‌లు చేసి గట్టిగా క్లాస్ పీకినట్లు తెలిసింది. ఒకరిద్దరు అభ్యర్థులు అయితే డబ్బులు పంచని వారిపై తీవ్ర ఆగ్రహావేశాలతో అంతు చూస్తామని హెచ్చరించినట్లు సామాజిక మాధ్యమాల్లో సైతం బహిర్గతం అయ్యాయి.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

- నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

నల్లగొండ : తేదీన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ తెలిపారు. శుక్రవారం ఆయన తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ఉదయం 8 గంటలకు నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్, నాగార్జునసాగర్ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపును చేపట్టనున్నట్లు తెలిపారు. ఒక్కో నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు ఒక్కో హాల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ అనుమతి ఉన్నవారికే స్ట్రాంగ్ రూమ్స్‌లోకి అనుమతి ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

కొనసాగుతున్న రాచకాల్వ పూడికతీత పనులు


రాచకాల్వలో పూడిక తీస్తున్న ప్రొక్లెయిన్

శాలిగౌరారం: శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చే రాచకాల్వలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. రాచకాల్వలో పూడిక పేరుకుపోవడంతో ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు రైతుల సాగునీటి ఇబ్బందులను టీటీయూసీ ఉపాధ్యక్షుడు, మండల రైతుప్రతినిధి చామల వెంకటరమణారెడ్డితో పాటు పలువురు రైతు ప్రతినిధులు, నాయకులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రాజెక్టు అభివృద్ధి పనులలో భాగంగా రాచకాల్వలో పూడికతీత పనులను ఇటీవల అధికారులు చేపట్టారు. శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరేందుకు మూసీనదిపై రామన్నపేట మండలం పల్లివాడ వద్ద నిర్మితమై ఉన్న హెడ్‌రెగ్యులేటర్ నుంచి సుమారు 30 కిలోమీటర్ల పొడవులో ఉన్న రాచకాల్వ ద్వారా శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుంది. ఈ రాచకాల్వకు రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలకు చెందిన పలు చెరువులు, కుంటలు అనుసంధానమై ఉన్నాయి.

కొత్త మద్యం దుకాణాలు ప్రారంభం

- యాదాద్రి జిల్లా వ్యాప్తంగా 82 షాపులు
- రెండు రోజులుగా దుకాణాలు బంద్
- మద్యం రాగానే ఎగబడిన జనం

భువనగిరి: జిల్లా వ్యాప్తంగా 2023- 25 సంవత్సరానికిగాను కొత్త మద్యం దుకాణాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి, గత ఆగస్టులో నూతన మద్యం షాపులకు సంబంధించి టెండర్ల కోసం ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో జిల్లాలోని 82 మద్యం దుకాణాల కోసం 3,970 దరఖాస్తులు వచ్చాయి. గత ఆగస్టు 21న భువనగిరి పట్టణ శివారులోని సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో లాటరీ నిర్వహించారు. గతంలో లాటరీ ద్వారా దక్కించుకున్న మద్యం షాపుల నిర్వాహకుల గడువు నవంబర్ నెలాఖారు వరకు ఉంది. నూతనంగా షాపులను దక్కించుకున్న వారికి డిసెంబర్ 1 నుంచి నిర్వహించుకోవడానికి అవకాశం ఉంది. దీంతో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభించారు.

రెండు రోజుల తర్వాత తెరుచుకోవడంతో..

తొలిరోజున ఘట్కేసర్ సమీపంలోని బోగారం మద్యం డిపోనుంచి మద్యం తేవడం ఆలస్యమైంది. రాత్రి 10 గంటల వరకు 70శాతం దుకాణాలకు మద్యం చేరింది. అయితే ఉదయం మద్యం డిపోకు వెళ్లిన వారికి మాత్రం సాయంత్రం 6 గంటల వరకు మద్యం రావడంతో దుకాణాల్లో అమ్మకాలు ప్రారంభించారు. ఈనెల 30న ఎన్నికల సందర్భంగా 48 గంటల ముందుగానే జిల్లాలో మద్యం దుకాణాలు మూసి వేసిన విషయం తెలిసిందే. అయితే మద్యం దుకాణాల కాలపరిమితి ముగియడంతో పాత మద్యం దుకాణాల యజమానులు మద్యం నిల్వ చేయలేదు. దీనికితోడు వారి వద్ద ఉన్న మద్యాన్ని రాజకీయ పార్టీలు కొనుగోలు చేశాయి. దీంతో పాత మద్యం దుకాణాల్లో కూడా మద్యం ప్రియులకు మందు దొరకలేదు. పోలింగ్‌పూర్తి అయిన వెంటనే మద్యం, బీర్ల కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దుకాణాలు లేకపోవడం కొత్త దుకాణాల్లో శుక్రవారం రాత్రి వరకు మద్యం లభించకపోవడంతో మద్యం ప్రియులు అల్లాడిపోయారు. ఈక్రమంలో కొత్తగా తెరిచిన మద్యం దుకాణాలకు స్టాక్ రావడంతో ఒక్కసారి మద్యం ప్రియలు మద్యం, బీర్ల కోసం ఎగబడ్డారు. కాగా.. జిల్లాలో అన్ని కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. రాత్రి పది గంటల వరకు దుకాణాలకు మద్యం వస్తుందని, డిపోలో ఏ కారణం చేతనైన ఆలస్యమైతే శనివారం ఉదయం మద్యం లభిస్తుందని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా లోలెవల్ బ్రిడ్జి!

- బ్రిడ్జి మధ్యలో ఏర్పడిన గొయ్యి
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు


శాలిగౌరారం బస్టాప్ సమీపంలో లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యి

శాలిగౌరారం: నకిరేకల్-గురుజాల ప్రధాన రోడ్డుపై శాలిగౌరారం బస్టాప్ సమీపంలో ఉన్న లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గొయ్యి అత్యంతం ప్రమాదకరంగా మారింది. నకిరేకల్-గురుజాల రోడ్డు మండల కేంద్రంతో పాటూ ఇటు నకిరేకల్‌కు అటు మోత్కూరు, అడ్డగూడూరు, తిరుమలగిరి మండలాలకు అనుసంధానంగా ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం వందలాది వాహనదారులు ప్రయాణిస్తుంటారు. మండల కేంద్రంలోని ప్రధానరోడ్డుపై ఉన్న ఈ లోలెవల్ బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో ఈ లోలెవల్ బ్రిడ్జిపై ప్రయాణించే సమయంలో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఇరుకు లోలెవెల్ బ్రిడ్జిపై భారీ గొయ్యి ఏర్పడడంతో వాహనదారులు పడే బాధలు అన్నీఇన్నీ కావు.

ప్రమాద నివారణ చర్యలు చేపట్టని అధికారులు

ప్రస్తుతం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండడంతో ధాన్యం లోడ్లతో లారీలు వెళ్లే క్రమంలో సంబంధిత వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యి సమీపంలోకి వచ్చేవరకు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాద బారిన పడుతున్నారు. లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యి వల్ల పగటిపూటే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారంటే ఇక రాత్రి వేళల్లో పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉంటుందో ఊహించవచ్చు. ఇప్పటికే అనేకమంది వాహనదారులు ఈ బ్రిడ్జిపై ప్రమాదాలబారిన పడ్డారు. బ్రిడ్జిపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడం, ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలను అధికారులు చేపట్టకపోవడం గమనార్హం. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని బ్రిడ్జిపై ఏడిన గొయ్యిని పూడ్చి ప్రమాదాలను నివారించాలని శాలిగౌరారం మండల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బంది

బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యి పరిమాణం పెరిగితే బ్రిడ్జి కొంతమేర కూలిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే శాలిలింగోటం, అంభారిపేట, రామగిరి, గురుజాల, మనిమద్దె, రామాంజాపురం, ఉప్పలంచ, తుడిమిడి, చిత్తలూరు గ్రామాలతోపాటూ మోత్కూరు, అడ్డగూడూరు, తిరుమలగిరి మండలాలకు రాకపోకలు నిలిచిపోనున్నాయి.

ప్రమాదాలకు గురవుతున్నాం



శాలిగౌరారం మండల కేంద్రంలోని బస్టాప్ వద్ద ఉన్న లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గొయ్యి అత్యంత ప్రమాదకరంగా మారింది. రాత్రివేళల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యిని పూడ్చివేసి వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా నివారించాలి.

– చిరబోయిన పరమేశ్, రామగిరి

అధికారుల వైఫల్యంతోనే ప్రజలకు అవస్థలు



మండల కేంద్రంలోని బస్టాప్ సమీపంలో ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై ఎంతోకాలంగా రోడ్డు దెబ్బతిని కుంగిపోయింది. సంబంధిత అధికారులు దెబ్బతిన్న రోడ్డుపై పటిష్ట మరమ్మతులు చేయకుండా తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. దీంతో బ్రిడ్జి రోడ్డు ప్రమాదకరంగా మారింది. అధికారుల వైఫల్యం వల్ల ప్రజలు అవస్థలకు గురికాక తప్పడం లేదు.

– గోదల వెంకట్‌రెడ్డి, శాలిగౌరారం

కరెన్సీతో అలంకరణ


కార్తీక మాసం శుక్రవారం సందర్భంగా నల్లగొండలోని బీట్ మార్కెట్‌లో గల రామకోటి స్థూప ఆలయంలో శివుడి విగ్రహానికి కరెన్సీ నోట్లతో అలంకరణ